# సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 6 । జనవరి । 2023



## సింగరేణి సీఎండీని కలిసిన వెంకట్రావు

గోదావరిఖని: సింగరేణి సీఎండీ శ్రీధర్‌ను టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



## పత్తి క్వింటాల్‌కు రూ.8,314

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు గురువారం గరిష్ఠంగా రూ.8,314 పలికింది. కనిష్ఠంగా రూ.7,755, సరాసరిగా రూ.8,200గా నమోదైందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
26.0 /19.0

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఎండవేడిమి ఉంటుంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

## న్యూస్‌రీల్

### హోంమంత్రిని కలిసిన కోలేటి



హోం మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కోలేటి దామోదర్

గోదావరిఖని: రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని పోలీస్ హౌజింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ గురువారం కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

### ప్రత్యేక రైళ్లకు రామగుండంలో హోల్టింగ్ కల్పించండి

రామగుండం: రామగుండం మీదుగా వెళ్లే ప్రత్యేక రైళ్లకు స్థానిక రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని రైల్వే ప్రజాసంబంధాల మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ రైల్వే అధికారులను కోరారు. బీహార్ వెళ్లే రైలుకు ఇక్కడ హాల్టింగ్ లేకపోవడంతో రైల్వే, ఎన్టీపీసీ ఉద్యోగులు, కార్మికులు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడి నుంచి పాట్నాకు నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, ఈ నేపథ్యంలో రైలుకు హాల్టింగ్ కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు.

### బీఆర్‌ఎస్ తీరుతోనే బొగ్గు గనుల ప్రైవేటీకరణ



మాట్లాడుతున్న కేంద్ర కార్యదర్శి సమ్మయ్య

గోదావరిఖని: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరుతోనే కేంద్రం ఎంఎండీఆర్ కింద బొగ్గు బ్లాకులను ప్రైవేట్‌కు అప్పగిస్తోందని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య తెలిపారు. గురువారం జీడీకే–1 గనిలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. అప్పుడు సంతకాలు చేసి ఇప్పుడు ప్రైవేట్‌కు ఇవ్వొద్దనడం, ఎమ్మెల్యే చందర్ బాయిబాట పేరుతో కేంద్రంపై పోరాటం చేస్తున్నామనడం హాస్యాస్పదంగా ఉందన్నా రు. కార్మికుల కుటుంబాలకు మురికినీరు సరఫరా అవుతున్నా ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, రంగు శ్రీనివాస్, సంకె అశోక్, వెంకట్‌రెడ్డి, మోహన్, భాస్కర్, రాజేష్ పాల్గొన్నారు.

- ఉద్యోగాల కల్పన బీఆర్‌ఎస్ వంతు, అమ్మకాలు బీజేపీ తంతు
- నార్మల్ డెలివరీతో గంటలోనే బిడ్డకు తల్లిపాలు
- గర్భిణులకు అవగాహన కల్పించటంలో సర్పంచ్‌లదే బాధ్యత
- రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- నందిమేడారంలో సీహెచ్‌సీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# అన్ని రంగాల్లో మనమే ముందు..!

### భూమికి బరువయ్యేంత పంట పండుతోంది



మంత్రులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సాక్షి, పెద్దపల్లి: రాష్ట్రంలో భూమికి బరువయ్యేంత పంట పండుతోందని, గతంలో రాష్ట్రంలో 68 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పుడు 2.49 కోట్ల టన్నుల ధాన్యం పండుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ధర్మారం మండలం నందిమేడారంలో నిర్మించనున్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి గురువారం రాత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రైతులను కాల్చి చంపించిన చంద్రబాబు రైతుల గురించి ఖమ్మంలో మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రైతులకు మందు బస్తాలు అందించలేని, దొంగ రాత్రి కరెంట్ ఇచ్చి రైతుల చావులకు కారణమైన కాంగ్రెస్.. బోర్లకు మీటర్లు పెట్టాలనే బీజేపీ నాయకులు అన్నదాతల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బావుల వద్ద మీటర్లు పట్టకపోవడంతో ద్వారా రాష్ట్రానికి రావాల్సిన రూ.30 వేల కోట్లను కేంద్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రైతులు ధాన్యం ఆరబోసుకునేందుకు కల్లాలు నిర్మిస్తే.. కేంద్రం వాటికి ఖర్చుచేసిన రూ.150కోట్లు వాపస్ ఇవ్వాలని ఒత్తిడి చేస్తోందన్నారు. చేపలు ఎండబెట్టడానికి కల్లాలు కట్టడం సరైందని వాదించే బీజేపీ.. రైతుల ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు కట్టడం తప్పనడం భావ్యం కాదన్నారు. సింగరేణిలో రాష్ట్రం వాటా 51శాతం ఉందని రామగుండం సభలో చెప్పిన ప్రధాని మోదీ.. ఢిల్లీకి వెళ్లాక ఐదు బొగ్గు బావులను వేలం వేయించడం సిగ్గు చేటన్నారు. సిజేరియన్లతో తల్లి భవిష్యత్తులో పొలం పనులు చేసుకోలేని పరిస్థితి ఉంటుందన్నారు. సాధారణ ప్రసవంతో బిడ్డకు పుట్టిన వెంటనే తల్లి పాలు అందే అవకాశముందన్నారు. తల్లి ముర్రుపాలు బిడ్డకు తప్పకుండా తాగించాలని, లేకుంటే వారి ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఆ పాలు టీకాతో సమానమన్నారు. సీసీ రోడ్లు, కాల్వలు కట్టడమే కాదు.. గ్రామాల్లోని గర్భిణుల ఆరోగ్యం కాపాడేందుకు వారికి అవగాహన కల్పించడం సర్పంచ్‌లు, ఎంపీటీసీల బాధ్యత అన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ఆరెకరాల భూమి దానం చేసిన శ్రీధర్‌రావు, నర్సింగ్‌రావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ముందంజలో రాష్ట్రం**

రాష్ట్రం వ్యవసాయ, వైద్య, పారిశ్రామిక, పంచాయతీరాజ్ ఇలా అన్ని రంగాల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత అన్నారు. తెలంగాణలోని రైతులు, ఆదివాసీలు, ప్రజల కోసం బీఆర్‌ఎస్ పార్టీ తరఫున సేవకులుగా పనిచేస్తామన్నారు. రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్‌గా నిలిపేందుకు ప్రయత్నిస్తామన్నారు.

**అభివృద్ధే లక్ష్యం**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మొదటిసారిగా అత్యధికంగా రూ.11.5 లక్షల పరిహారం నందిమేడారం గ్రామంలో అందించామని, ఈ గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన 30 పడకల ఆసుపత్రి మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావుకు మంత్రి కొప్పుల ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. ముంపు నివారణకు వరదనీటి కాలువ నిర్మాణానికి మూడున్నర కోట్లు మంజూరు చేశామని, త్వరలో పనులకు శంకుస్థాపన తెలిపారు. ముదిరాజ్, బెస్తల కోసం అవసరమైన జాలిల నిర్మాణం త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, ధర్మారం జెడ్పీటీసీ పూస్కూరి పద్మజా, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. 30 పడకల సీహెచ్‌సీ ఆసుపత్రి శంకుస్థాపనలో కలెక్టర్ సంగీత, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, డీసీహెచ్‌ఎస్ శ్రీధర్ పాల్గొన్నారు.

# ఆసుపత్రి నిర్వహణ భేష్..!

- సుల్తానాబాద్ దవాఖానాను సందర్శించిన 'కాయకల్ప'
- రోగుల ద్వారా వివరాల సేకరణ



రోగుల ద్వారా వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి స్వచ్ఛతలో మెరుగుపడిందని కాయకల్ప బృందం సభ్యులు డాక్టర్ ప్రహ్లాద్ నాయక్ అన్నారు. గురువారం కాయకల్ప బృందం సభ్యులు ఏసుమని, మౌనికతో కలిసి వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిని సందర్శించారు. స్వచ్ఛతతోపాటు శుభ్రత, పరిశుభ్రత, రోగులకు సేవలపై ఆరా తీశారు. శానిటేషన్, బయోమెడిసిన్ నిర్వహణ, స్టోరేజీ స్టెరిలైజేషన్ హైజనిక్ కిట్స్, లేబర్ రూమ్ నిర్వహణపై ఆరా తీశారు. ప్రతిరోజూ ఎన్నిసార్లు శానిటేషన్ చేస్తున్నారని రోగులను అడిగి తెలుసుకున్నారు.

**ప్రతి గది పరిశీలన**

ఆసుపత్రిలోని ప్రతి గదినీ కమిటీ సభ్యులు సందర్శించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, బెడ్‌షీట్ల సామగ్రి, వాష్, డెలివరీరూం, ల్యాబ్, ఎక్స్‌రే, ఫార్మసి రూమ్‌ను పరిశీలించి.. పరిశుభ్రత బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలు బాగున్నాయని పలువురు రోగులు కమిటీకి వివరించారు. 350పాయింట్లు.. 700 మార్కుల్లో 70శాతానికి పైగా వచ్చిన ఆసుపత్రుల వివరాలను రాష్ట్రబృందం సభ్యులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. వారు మరోసారి ఆసుపత్రిని సందర్శించి ఫైనల్ జాబితాను రాష్ట్ర వైద్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌కు నివేదిస్తారని, వారు అవార్డు ప్రకటిస్తారని బృందం సభ్యులు తెలిపారు. జిల్లా క్వాలిటీ కంట్రోలర్ అధికారి అనిల్ కుమార్, సుల్తానాబాద్ డీడీఓ డాక్టర్ రమాదేవి, డాక్టర్లు శ్రీధర్, సునీత, అరుణ, రామ్మోహన్, మహేందర్ హెడ్‌నర్స్ వసంత, స్టాఫ్‌నర్స్ నర్సమ్మ, రేవతి, సునీత, సరిత, కనకతార, సిబ్బంది చారి, జుల్ ఫక్కర్, అమర్, నరేష్ ఉన్నారు.

**గతంలో అవార్డులు..**

ఆసుపత్రి వైద్య విధాన పరిషత్‌లోకి మారకముందు సీహెచ్‌సీగా ఉండేది. 2018 – 20లో నిర్వహించిన సర్వేలో ప్రథమస్థానంలో నిలిచింది. ఆ సమయంలో వచ్చిన నిధులను వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించారు. 2021–22లో నిర్వహించిన సర్వేలో కన్సోలేషన్ బహుమతి వచ్చింది. తాజాగా ఈ ఏడాది మొదటి బహుమతి వస్తుందన్న నమ్మకాన్ని డాక్టర్ రమాదేవి వ్యక్తం చేశారు.



# సుందర పెద్దపల్లిగా తీర్చిదిద్దుతా..!

పెద్దపల్లిరూరల్: పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్న. పట్టణంలోని ప్రధాన కూడళ్ల సుందరీకరణ త్వరలోనే చేపడతాం. ఆహ్లాదాన్ని పంచేలా మినీ ట్యాంకుబండ్ పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం. మున్సిపాలిటీ విస్తీర్ణం పెరిగినా.. అందుకు తగ్గట్టు హోదా పెరగాల్సి ఉంది. విస్తరిస్తున్న పెద్దపల్లిలో స్వచ్ఛత, పరిశుభ్రత పనులకోసం అవసరమైన పారిశుధ్య సిబ్బంది లేక కొంత ఇబ్బంది కలుగుతోంది. ఇందుకు ప్రజలు తమవంతు సహకారం అందించాలి. స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చి దిద్దేందుకు ముందుకు రావాలి. మున్సిపల్ ఆఫీసు సొంత భవన నిర్మాణ పనులను త్వరలోనే పూర్తిచేస్తాం. ప్రధాన కూడళ్లలో ప్రజలు, ముఖ్యంగా మహిళల అత్యవసరా ల కోసం మొబైల్ టాయిలెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా.. అని పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి తెలిపారు. గురువారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో ప్రజలకు సమాధానాలు ఇచ్చారు.

### 'సాక్షి' 'ఫోన్‌ఇన్' లో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

- రూ.40లక్షలతో కూడళ్ల సుందరీకరణ
- రూ.15కోట్లతో రోడ్ల అభివృద్ధి
- పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి

ప్రశ్న: దోమల బెడద ఎక్కువగా ఉంది.. నియంత్రణ చర్యలేవీ..?
– బి.జైపాల్‌రెడ్డి, ఎస్.సురేశ్

చైర్‌పర్సన్: ఇంటి ఆవరణ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణకు మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నారు. ఐదు ఫాగింగ్ మిషన్లను తెప్పించి వినియోగిస్తున్నాం.

ప్రశ్న: కమాన్ వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వాసనతో ఇబ్బంది పడుతున్నం.. – అజీజియా

చైర్‌పర్సన్: ఈ విషయం మా పరిధిలోనిది కాదు. అయినా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా చూస్తా.

ప్రశ్న: చెత్త సేకరణకు వచ్చేవారు నెలకు రూ.50 ఇవ్వాలంటున్నారు..?
– శ్రీకాంత్, 21వ వార్డు, శాంతినగర్

చైర్‌పర్సన్: మున్సిపల్‌లో పారిశుధ్య పనులకు అవసరమైన సిబ్బంది లేరు. ఈ కారణంగా కొన్ని వార్డులు ఇతరులకు అప్పగించాం. పారిశుధ్యం మెరుగుకు అందరి సహకారం అవసరం. ఈ విషయమై ఆలోచించి నిర్ణయం తీసుంటాం.

ప్రశ్న: మిషన్ భగీరథ కనెక్షన్ల పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి.. కనెక్షన్లు ఇవ్వడం లేదు..? – బాలసాని వెంకటేశం

చైర్‌పర్సన్: మిషన్‌భగీరథ పైప్‌లైన్ కనెక్షన్లు అందరికీ ఇస్తారు. వార్డుల వారీగా సర్వే జరుగుతోంది. తవ్విన రోడ్లకు సీసీ రోడ్డు వేసే పనులు కూడా జరుగుతున్నాయి.

ప్రశ్న: రోడ్ల వెంట తడి, పొడిచెత్త డబ్బాలు ఏర్పాటు చేయండి..
– జవ్వాజి రాజేశ్, భూంనగర్

చైర్‌పర్సన్: కమ్యూనిటీ కంపోస్టు సేకరణకు డబ్బాలు తెప్పించాం. వీటిని వినియోగించే విషయమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.

ప్రశ్న: మున్సిపాలిటీలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమి కేటాయింపునకు సహకరించండి.. – కట్ట రాజానందం, విశ్వబ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు

చైర్‌పర్సన్: ఈ విషయం మా పరిధిలోనిది కాదు. మీరు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇవ్వండి.

ప్రశ్న: సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీ పనుల్లో నాణ్యత లోపిస్తోంది..?
– కర్రె రాజు, బీజేపీ నాయకుడు

చైర్‌పర్సన్: పనులు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసిన తర్వాతే బిల్లుల చెల్లింపు జరుగుతుంది. అయినా పనుల నాణ్యతపై మరోసారి పరిశీలన చేస్తా.

ప్రశ్న: కమాన్‌వద్ద ఉన్న బోరుబావి సమీపంలో నీరుచేరి పందులు తిరుగుతున్నాయి..
– సునీల్‌గౌడ్

చైర్‌పర్సన్: బోరుబావి వద్ద ఇంకుడుగుంత, ప్లాట్‌ఫాం నిర్మించి నీరుపొంగకుండా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: మేరవాడ, నారాయణస్వామినగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులున్నాయి..
– బాపన్న, రాజన్న, మసూద్, రజాక్, తిరుపతి, 8వవార్డు

చైర్‌పర్సన్: త్వరలోనే వార్డును సందర్శిస్తా. సమస్యలు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: ప్రధాన కూడళ్లు, ముఖ్యంగా జెండాచౌరస్తాలో టాయిలెట్స్ లేక ఇబ్బందులున్నాయి.. – పూదరి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు

చైర్‌పర్సన్: టాయిలెట్ల అవసరాన్ని గుర్తించాం. ఇందుకు ఓ మొబైల్ టాయిలెట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: మిషన్‌భగీరథ ట్రయల్ రన్ ఎప్పుడు..?
– మంథని నర్సింగ్

చైర్‌పర్సన్: మిషన్‌భగీరథ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. ట్రయల్ రన్ చేసిన తర్వాతే సిమెంట్ పనులు చేయాలని సంబంధిత అధికారులకు సూచిస్తా.

ప్రశ్న: 9వవార్డులో సిమెంట్ రోడ్డు వేసి, అంతకన్న ఎత్తుతో డ్రైనేజీ నిర్మించడంతో మురుగునీరంతా ఇంట్లోకే చేరుతోంది.. – రజిత

చైర్‌పర్సన్: ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునేలా ఆదేశిస్తా.

ప్రశ్న: రాజీవ్‌రోడ్డుపై డివైడర్లలో పెరుగుతున్న చెట్లతో ఇబ్బందిగా ఉంది..
– అనిల్, బండివాడ, పెద్దపల్లి

చైర్‌పర్సన్: డివైడర్ల మధ్యలో చెట్ల నిర్వహణ హెచ్‌కేఆర్ సంస్థ వారి బాధ్యత. వారితో మాట్లాడి పరిష్కారానికి ప్రయత్నిస్తా.

ప్రశ్న: రంగంపల్లి శ్మశాన వాటిక వద్ద రైస్‌మిల్లుల నుంచి కాలుష్యపు వెలువడి దుర్గంధం వస్తోంది..? – పవన్, రంగంపల్లి

చైర్‌పర్సన్: ఆ ప్రాంతాన్ని పరిశీలించి కాలుష్య నీరు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటా.

# పెరిగిన వరి విస్తీర్ణం!

### గతేడాది కన్నా గణనీయంగా పెరిగిన సాగు

- కేంద్రంతో ఘర్షణ వల్ల క్రితంసారి తగ్గుదల
- ధాన్యం కొంటామన్న ప్రకటనతో పంటలో వృద్ధి
- స్వల్పంగా తగ్గిన భూగర్భ జలాలు
- వరిసాగు కారణంగా పెరిగిన జలాల వినియోగం



నాట్లు వేస్తున్న కూలీలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వరిసాగులో రాష్ట్రంలో ముందు వరుసలో ఉంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మరోసారి తన సత్తా చాటింది. గతేడాది యాసంగిలో వరికి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన కలకలానికి దారి తీసింది. మరోవైపు పారాబాయిల్డ్ విషయంలో కేంద్ర రాష్ట్ర– ప్రభుత్వాల మధ్య సాగిన సంఘర్షణ కూడా రైతుల్లో ఉత్కంఠ పెంచింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యాన్ని కొనేది లేదని రాష్ట్ర సర్కారు తేల్చి చెప్పగా.. తక్కువమంది మాత్రమే ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపారు. మెజారిటీ రైతులు వరిసాగుకే జైకొట్టారు. తమ భూమిలో వరి మినహా మరేదీ పండవని, ఏదైతే అదైందని చాలామంది రైతులు వరి వేశారు. కొందరు క్వింటాలుకు రూ.1200 తక్కువ ధరకు రైసుమిల్లులు, సీడ్ కంపెనీలతో ఒప్పందం చేసుకుని కొద్దిమొత్తంలో సాగుచేశారు.

**పుంజుకున్న వరి**

- గతేడాది వడ్ల కొనుగోలు విషయంలో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం ముదరడంతో చివరికి రాష్ట్రమే కొంటామని ముందుకొచ్చింది.
- ఈసారి ఎలాంటి ఇబ్బందులు లేకపోవడం, వర్షాలు కూడా దండిగా కురవడంతో రైతులు తిరిగి వరి పంటకే మొగ్గుచూపారు. దీంతో కిందటేడాది కన్నా వరిసాగు గణనీయంగా పెరిగింది.
- ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలో గతేడాదితో పోల్చినపుడు ఈసారి వరిని 6,41,158 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేయగా జనవరి 4వ తేదీ వరకు 2,61,150 ఎకరాలు సాగు చేశారు.
- మిగిలిన పంటలు మొత్తం కలిపి 7,39,659 ఎకరాలు సాగు అవుతుందని అంచనా వేస్తుండగా.. ఇప్పటి వరకూ (జనవరి 4 వరకు) 2,90,800 ఎకరాలు సాగైంది.
- మొక్కజొన్న మాత్రం కరీంనగర్‌లో సీజన్ సాధారణంగా 24,145 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 3479 ఎకరాలు, పెద్దపల్లిలో 9758 ఎకరాలకు గాను 3479 ఎకరాలు, జగిత్యాల 17147 ఎకరాలకుగాను, 20774 ఎకరాలు, సిరిసిల్ల 1248 ఎకరాలకుగాను 276 ఎకరాల్లో సాగైంది.

**యాసంగిలో సాగైన వరి..**

| జిల్లా | అంచనా | ఈనెల4వరకు | గతేడాది | ప్రస్తుతం |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 1,91,074 | 17,646 | 8,693 | 90,116 |
| పెద్దపల్లి | 1,50,495 | 21,978 | 4,429 | 37,060 |
| జగిత్యాల | 1,95,059 | 13,403 | 626 | 93,684 |
| రాజన్నసిరిసిల్ల | 1,04,530 | 18,720 | 1,674 | 40,290 |

**అన్ని పంటలు యాసంగి సీజన్...**

| జిల్లా | అంచనా | ఈనెల4 వరకు | గతేడాది | ప్రస్తుతం |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 2,20,286 | 33,909 | 23,458 | 94,544 |
| పెద్దపల్లి | 1,62,004 | 26,169 | 7,391 | 38,952 |
| జగిత్యాల | 2,48,433 | 36,748 | 21,430 | 1,16,099 |
| రాజన్నసిరిసిల్ల | 1,08,936 | 21,458 | 4,109 | 41,205 |

**జోరుగా వానలు..**

మరోవైపు ఈసారి ఈశాన్య, నైరుతి రుతుపవనాల సమయంలో జోరుగా వానలు కురిశాయి. దీంతో ఈసారి కరీంనగర్ జిల్లాలో సాధారణ వర్షపాతం 833.3 మి.మీలు కాగా 1366.7 మి.మీలు అంటే 64 శాతం అధికంగా పడింది. పెద్దపల్లి జిల్లా సాధారణ వర్షపాతం 998.1 కా గా, 51శాతం అదనంగా 1505.1 మిమీల వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా సగటు వర్షపాతం967.9 మి.మీలకు గాను 68 శా తం అదనంగా1623.1 మిమీ కురవడం గమనార్హం. ఇక రాజన్న సిరిసిల్ల విషయానికి వస్తే.. 851.5 మిమీ సాధారణ వర్షపాతానికి 50 శా తం అదనంగా 1280 మి.మీలు కురవడం విశేషం.

**గంగమ్మ దిగువకు..**

- గతేడాది చాలామంది రైతులు వరిసాగుపై ఆసక్తి చూపకపోవడంతో మోటార్లు పనిచేయలేదు. ఫలితంగా మోటబావుల ద్వారా తక్కువ నీరు వినియోగించుకున్నారు.
- ఈసారి సర్కారు వరిసాగుపై స్పష్టత ఇవ్వడంతో బావుల్లో నీటి వినియోగం పెరిగి, భూగర్భ జలాలు దిగువకు జారిపోయాయి. కరీంనగర్‌లో 2021 డిసెంబరులో 4.83 మీటర్లు ఉండగా..ఈ ఏడాది అది 5.16 మీటర్ల దిగువకు చేరింది.
- జగిత్యాలలో భూగర్భ జలాలు గతేడాది భూఉపరితాలనికి 3.72 మీటర్ల దిగువన ఉండగా 2022 డిసెంబరునాటికి 3.86 మీటర్లకు చేరాయి.
- పెద్దపల్లిలో పాతాళ గంగ 2021 డిసెంబరులో 5.87 మీటర్ల దిగువన ఉండగా.. 2022 డిసెంబరునాటికి 4.56 మీటర్లకు వచ్చింది. అంటే 1.31 మీటర్లు పైకి ఎగిసింది.
- సిరిసిల్ల జిల్లాలో డిసెంబరు(2021)లో 4.52 మీటర్ల లోతున ఉన్న భూగర్భ జలాలు డిసెంబరు 2022 నాటికి 5.27 మీటర్లకు పడిపోయాయి.

# కండక్టర్‌కు ఎక్స్‌ట్రా మైలేజ్ ఏ–గ్రేడ్ అవార్డు



ఆర్టీసీఎండీ సజ్జనార్ నుంచి అవార్డు అందుకుంటున్న లక్ష్మీనారాయణ

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు చెందిన ఆర్టీసీ కండక్టర్ వీరగోని లక్ష్మీనారాయణ ఎక్స్‌ట్రా మైలేజ్ ఏ గ్రేడ్ అవార్డును ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హైదరబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో అందించారు. లక్ష్మీనారాయణ కరీంనగర్–2 డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. నవంబర్ నాలుగున డ్యూటీలో భాగంగా పెగడపల్లి నుంచి కరీంనగర్ వెళ్తోంది. జ్వరంతో బాధపడుతున్న తన కొడుకుతో కలిసి ఓ తల్లి బస్సులో ఎక్కింది. రామడుగు సమీపంలో బాబుకు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. దీంతో ఆ తల్లి రోదిస్తున్న తీరును చూసిన కండక్టర్ లక్ష్మీనారాయణ, డ్రైవర్ కిషన్ బస్సును షానగర్‌కు తీసుకెళ్లి బాబుకు ఓ ప్రైవేటు వైద్యుడితో చికిత్స అందించారు. బాబు స్పృహలోకి రాగానే తిరిగి కరీంనగర్ తీసుకెళ్లారు. విధి నిర్వహణలో భాగంగా సకాలంలో వైద్యం అందించి బాలుడి ప్రాణాలను కాపాడిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎక్స్‌ట్రా మైలేజ్ ఏ–గ్రేడ్ అవార్డును ఎండీ అందించారు. లక్ష్మీనారాయణను డిపో మేనేజర్ వి.మల్లయ్య, ధూళికట్ట ప్రజాప్రతినిధులు అభినందించారు.

## క్లుప్తంగా

### సాహిత్య పాఠశాలకు తరలిరండి



బాలసాని రాజయ్య

పెద్దపల్లిరూరల్: దేశ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థలను నిర్వీర్యం చేసే పాలకుల కుట్రలను విప్లవ రచయితల సంఘం వ్యతిరేకిస్తోందని విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈనెల 7, 8 తేదీల్లో సాహిత్య పాఠశాల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, దేవరాజ్ మహారాజ్, కళ్యాణ్‌రావు తదితరులు ప్రసంగిస్తారని, ఉమ్మడి జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు పాల్గొనాలని కోరారు.

### స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాకు మూడోస్థానం

పెద్దపల్లిరూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లా మూడోస్థానంలో నిలిచింది. స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద చేపట్టిన పరిశుభ్రత, హరితహారం, మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్ల వినియోగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ కేటగిరీలను నిర్ణయిస్తారని స్వచ్ఛభారత్ మిషన్ అధికారి రాఘవులు తెలిపారు. ప్రతినెల కేటగిరీలను పరిశీలించి గ్రేడింగ్ ఇస్తారని పేర్కొన్నారు. 4స్టార్ కేటగిరీ డిసెంబర్‌లో జిల్లా మూడోస్థానంలో నిలిచిందన్నారు. అక్టోబర్‌లో వార్షిక నివేదిక ఆధారంగా పరిశీలించి అవార్డు ప్రకటిస్తారని వివరించారు.

### రైలు వ్యాగన్ కిందపడి ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పాలకుర్తి మండలంలోని ఎల్కలపల్లికి చెందిన నామని శ్రీనివాస్(53) గురువారం ఉదయం బొగ్గు రైలు వ్యాగన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురైన ఆయన ఎల్కలపల్లి శివారులోని పోచమ్మ గుడి సమీపంలో సింగరేణి నుంచి ఎన్టీపీసీ వైపు వెళ్తున్న వ్యాగన్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌కు చెందిన పెద్ది లచ్చవ్వ(75) చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. లచ్చవ్వ కొన్నేళ్లుగా అనారోగ్యంతోపాటు, మతిస్థిమితం సరిగాలేక ఇబ్బంది పడుతోంది. కుమారుడు అంజయ్య వద్ద ఉంటోంది. బుధవారం అంజయ్య దంపతులు పొలం వద్దకు వెళ్లగా లచ్చవ్వ క్రిమిసంహారక మందు తాగి, తన మనవరాలికి చెప్పింది. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ఓటరు తుది జాబితా ఖరారు..!

- జిల్లా ఓటర్లు 6,64,926
- కొత్తగా నమోదైనవారు 18,866
- తొలగించిన ఓటర్ల సంఖ్య 7,788



ఓటరు జాబితా విడుదల చేస్తున్న బీఎల్‌ఓ

**జిల్లాలో ఓటర్ల వివరాలు..నియోజకవర్గాల వారీగా**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| పెద్దపల్లి | 1,19,915 | 1,20,120 | 07 | 2,40,042 |
| రామగుండం | 1,03,822 | 1,00,952 | 25 | 2,04,801 |
| మంథని | 1,09,238 | 1,10,840 | 05 | 2,20,083 |

పెద్దపల్లిరూరల్: జిల్లా ఓటర్ల తుది జాబితాను అధికారులు ఖరారు చేసి గురువారం ప్రకటించారు. బూత్‌లవారీగా ఓటరు జాబితా అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తెలిపారు. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,64,926 మంది ఓటర్లు ఉన్న జాబితాను విడుదల చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో అధికంగా 2,40,042 మంది ఓటర్లున్నారు. ఆ తర్వాతి స్థానంలో మంథనిలో 2,20,083 మంది, తక్కువగా రామగుండంలో 2,04,801 మంది ఓటర్లున్నట్లు జాబితాను బట్టి తెలుస్తోంది.

**'తొలి' ఓటు కోసం**

ఓటు హక్కు పొందిన వారిలో 18 నుంచి 19 ఏళ్ల వయస్సులోపు ఉన్న ఓటర్లు 7,461 మంది ఉన్నారు. వీరంతా తొలిసారిగా ఓటు వేసేందుకు హక్కు పొందారు. యువ ఓటర్ల నమోదులో పెద్దపల్లి నియోజకవర్గం ముందుంది. పెద్దపల్లి సెగ్మెంట్‌లో 3,158 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మంథనిలో 2,896 మంది, రామగుండంలో 1407 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

**కొత్తగా నమోదు**

ఓటరు జాబితాలో 18 ఏళ్లు నిండినవారంతా విధిగా పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో కొత్తగా 18,866 మంది ముందుకొచ్చారు. ఇందులో పెద్దపల్లిలో 7,731 మంది, మంథనిలో 7,791, రామగుండంలో 3,344 మంది పేర్లను నమోదు చేసుకున్నారు.

**తొలగింపులు..**

వివిధ కారణాలతో ఓటరు జాబితా నుంచి 7,788 మంది పేర్లను తొలగించారు. అత్యధికంగా 4,859 మంది ఓటర్లను మంథని నుంచి తొలగించారు. పెద్దపల్లిలో 1,430 మంది, రామగుండంలో 1,499 మందిని జాబితా నుంచి తొలగించారు.

**రామగుండంలో పురుషులు.. మంథనిలో మహిళలు అధికం**

రామగుండం నియోజకవర్గంలో మహిళా ఓటర్ల కంటే 2,868 మంది పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 1,03,822 మంది పురుషులు, 1,00,954 మంది మహిళా ఓటర్లున్నారు. పెద్దపల్లిలో మహిళా ఓటర్లు 1,20,120, పురుషులు 1,19,915మంది ఉన్నారు. మంథనిలో 1,10,840 మంది మహిళలు, 1,09,238 మంది పురుషులు ఓటర్లుగా నమోదయ్యారు.

## ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జీఎం మనోహర్

కమాన్‌పూర్(మంథని): సింగరేణి సంస్థ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం మనోహర్ అన్నారు. కమాన్‌పూర్ మండలం పేంచికల్‌పేటలో గురువారం ఆర్జీ–2 ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సమీప గ్రామాల ప్రజల సౌకర్యం కోసం అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో సోలార్ లైట్లు, చేతిబోర్లు, ఇంకుడుగుంతలు మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం అబ్దుల్ సలీం, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, డాక్టర్ మహిపాల్, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, పీవో రాజారెడ్డి, సర్పంచ్ కొండ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## 'నా కూతురు ఆత్మహత్యకు అత్తింటి వేధింపులే కారణం'



సంధ్య–శ్రీకాంత్ పెళ్లి ఫొటో

- పోలీసులకు ఫిర్యాదు చేసిన సంధ్య తండ్రి రాజేందర్
- కఠినంగా శిక్షించాలని వేడుకోలు
- ముగిసిన మృతురాలి అంత్యక్రియలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): అదనపు కట్నం కోసం అత్తింటివారు వేధించడం వల్లే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని కొట్టె రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన కూతురు సంధ్య బుధవారం పుట్టింట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్న విషయం విధితమే. పోలీసుల వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం గ్రామానికి చెందిన కొట్టె రమాదేవి–రాజేందర్ దంపతులు తమ కూతురు సంధ్యను వరంగల్‌కు చెందిన బొట్టు రమాదేవి–సదానందం దంపతుల కుమారుడు శ్రీకాంత్‌కిచ్చి 8–12–2021న వివాహం జరిపించారు. కట్నం కింద రూ.14 లక్షలు ఒప్పుకున్నారు. వివాహ సమయంలో 12 తులాల బంగారం, రూ.4 లక్షలు ఇచ్చారు. పెళ్లయిన తర్వాత 8 నెలలు సంధ్యను బాగానే చూసుకున్నారు. ఆమె గర్భం దాల్చినప్పటి నుంచి భర్త శ్రీకాంత్, అత్త రమాదేవి, మామ సదానందంలు అదనపు కట్నం రూ.5 లక్షలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సంధ్య గర్భిణీ అని చూడకుండా అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధించారు. పుట్టింటికి వచ్చినప్పుడల్లా సంధ్య బాధపడితే తల్లిదండ్రులు సర్ది చెప్పేవారు. 31–12–2022న రాజేందర్ తన కూతురిని కూనారం తీసుకువచ్చాడు. 4–1–2023న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సంధ్య, అత్తింటి వేధింపులను తలుచుకొని, తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకుంది. సంధ్య ఆత్మహత్యకు ఆమె అత్తామామ, భర్త కారణమని మృతురాలి తండ్రి రాజేందర్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. వారిని కఠినంగా శిక్షించాలని వేడుకున్నాడు. సంఘటన స్థలానికి పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి, సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాజవర్ధన్ వెళ్లి, పంచనామా నిర్వహించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంధ్య మృతదేహానికి ఆమె పుట్టింటివారు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికులు తరలివచ్చి, కన్నీరు పెట్టుకున్నారు.

## సంస్కృత సాహితీ దిగ్గజం విజయసారథి



విజయసారథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యావేత్తలు, సాహితీవేత్తలు

కరీంనగర్ కల్చరల్: సంస్కృత సాహితీ దిగ్గజం శ్రీభాష్యం విజయసారథి అని పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు అన్నారు. సాహితీ గౌతమి, పారమిత విద్యాసంస్థలు, చేగుర్తి గ్రామ ప్రజల సంయుక్త ఆధ్వర్యంలో పారమిత ఎక్స్‌ప్లోరికా పాఠశాలలో గురువారం నిర్వహించిన శ్రీభాష్యం విజయసారథి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సమాజంలోని అన్ని కులాలు, వర్గాలు సమానమైనవేనని, హిందూ మతం ప్రపంచానికి అందించిన సమరసతాభావం అదేనని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి విజయసారథి అని కొనియాడారు. పారమిత పేరును వారే సూచించారని తెలిపారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ.. శబరి పదకింకిణీ, విషాద లహరి, భారత భారతి, రాసకేళి, మందాకిని వంటి అద్భుత గ్రంథాలు రచించి, సాహిత్య సృజనతో సమాజానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు శ్రీభాష్యం అని పేర్కొన్నారు. నేటికీ ఎన్నో దేవాలయాలకు ఆయన సుప్రభాత గీతాలే భగవంతుని మేలుకొలుపులని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి పద్యాలు, పాటలు, శ్లోకాల రూపంలో విజయసారథి చిత్రపటానికి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో సాహితీ గౌతమి కార్యనిర్వాహక అధ్యక్షులు గాజుల రవీందర్, డాక్టర్ కలువకుంట రామకష్ణ, కేఎస్.అనంతాచార్య, యాదగిరి శేఖర్‌రావు, సాధన శ్రీనివాస్‌రావు, భగవతి రమణారావు, స్తంభంకాడి గంగాధర్, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పని నచ్చకే సోషల్ మీడియాలో పోస్టు

- మంత్రి కేటీఆర్‌కు గల్ఫ్ బాధితుడి వేడుకోలు ఓ డ్రామా
- ప్రకటించిన కంపెనీ యాజమాన్యం
- వీసా, డబ్బులిచ్చి, యువకుడిని ఇంటికి పంపించిన వైనం



ఇమ్రాన్‌కు వీసా, టికెట్ అందిస్తున్న కంపెనీ యాజమాన్యం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దుబాయిలో కంపెనీ ఇబ్బందులు పెడుతోందని రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఇమ్రాన్ సోషల్ మీడియాలో చేసిన ఆరోపణలు అవాస్తమని సదరు యాజమాన్యం గురువారం ప్రకటించింది. పని నచ్చకపోవడంతో ఇంటికి వెళ్లేందుకు డ్రామా ఆడాడని తెలిపింది. వివరాలిలా ఉన్నాయి.. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎన్నారై రాధారపు సత్యం దుబాయిలో ఎల్ఎస్‌పీఎంకే కంపెనీ నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన షేక్ ఇమ్రాన్ ఉచిత వీసాపై ఆ కంపెనీలో పనిలో చేరాడు. కొంతకాలం చేసిన తర్వాత ఆ పని నచ్చలేదు. దీంతో తనను కంపెనీ ఇబ్బందులు పెడుతోందని, స్వగ్రామానికి రప్పించి, న్యాయం చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను సోషల్ మీడియా ద్వారా వేడుకున్నాడు. స్పందించిన ఆయన రాయబార సంస్థతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. యువకుడి పోస్టు వైరల్ కావడంతో స్పందించిన కంపెనీ యాజమాన్యం సదరు యువకుడితో మాట్లాడింది. తనకు ఇంటికి వెళ్లాలని ఉందని, అందుకే తప్పుగా పోస్టు పెట్టానని అతను ఒప్పుకున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా మానవతా దృక్పథంతో గతంలో అతనికి ఇచ్చిన వర్క్ వీసాను రద్దు చేసి, మరో వీసా, టికెట్‌తోపాటు 300 ధరమ్స్ ఇచ్చి, ఇంటికి పంపించింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ ఆ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపాడు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస్

గోదావరిఖని: ఓసీపీ–3లో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం కృషిభవన్‌లో కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. డంపర్ల సీట్లు మరమ్మతు చేయించాలని, సీట్ కుషన్లు చెడిపోయి ఇబ్బంది పడుతున్నామని కార్మికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బోల్డర్స్ రావడం వల్ల లోడింగ్, డంపింగ్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. స్పందించిన ఆయన గని మేనేజర్ కలిసి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట ఓసీపీ–3 ఫిట్ కార్యదర్శి కొంగర రవీందర్, నర్సయ్య, తిరుపతి, రవీందర్‌రెడ్డి, నరేష్, ఓదెలు, రాజు సమ్మయ్య, దేవేందర్ ఉన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం: ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి, ఓ మహిళ మృతికి కారణమైన డ్రైవర్‌కు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. బుగ్గారం మండలంలోని యశ్వంతరావుపేటకు చెందిన తోట తిరుమల్ తన తల్లి లలితతో 2017 ఏప్రిల్ 18న బైక్‌పై జగిత్యాల వస్తున్నాడు. జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామం వద్ద ఒర్సు అంజి (జగిత్యాల) ఎదురుగా ట్రాక్టర్‌ను వేగంగా నడుపుతూ వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో తిరుమల్, లలితలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ లలిత మరుసటి రోజే మృతిచెందింది. ట్రాక్టర్ డ్రైవర్‌పై అప్పట్లో కేసు నమోదైంది. గురువారం ఏపీపీ రాజేశ్, కోర్టు కానిస్టేబుల్ హరిప్రసాద్, సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా జేఎఫ్‌సీఎం న్యాయస్థానం మెజిస్ట్రేట్ అంజికి ఆరు నెలల జైలుశిక్షతోపాటు రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

## పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలు ప్రారంభం



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాపోటీలు గురువారం కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 కాలేజీల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. అంతకుముందు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు జ్యోతి ప్రజ్వలన చేసి, పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల జట్లు మార్చ్ ఫాస్ట్ చేయగా డీవైఎస్‌వో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం చేసిన టార్చ్ రిలే ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.అప్పారావు, లెక్చరర్లు పాల్గొన్నారు.



## తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఆరు కేసుల్లో 19.5 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ప్రకాశ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రకాశ్

రాయికల్(జగిత్యాల): తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా పెట్టుకున్న దొంగ మిట్టపల్లి లక్ష్మణ్‌ను అరెస్ట్ చేయడంతో ఆరు కేసుల్లో 19.5 తులాల బంగారం, 30 తులాల వెండి, ఒక బైక్, రూ.11 వేల నగదు, మొత్తం రూ.11.07 లక్షలు రికవరీ చేసినట్లు జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయికల్ మండలం రామారావుపల్లిలో గత డిసెంబర్ 18న కోట్టె రాజిరెడ్డి ఇంట్లో పట్టపగలే మిట్టపల్లి లక్ష్మణ్ దొంగతనానికి యత్నించగా, అతడి ఇంట్లో ఉన్న సీసీ పుటేజీ ద్వారా గుర్తించారు. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన లక్ష్మణ్ చిన్నతనం నుంచే చెడు అలవాట్లు, మద్యానికి బానిసై దొంగతనాలు చేయడంతో ఇంటి నుంచి కుటుంబ సభ్యులు వెళ్లగొట్టారు. 2013 నుంచి హైదరాబాద్‌లో గది కిరాయికి తీసుకుని ఉంటూ హోటల్‌లో పనిచేస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవాడు. జల్సాలకు డబ్బు సరిపోకపోవడంతో దొంగతనాలు మొదలుపెట్టాడు. హైదరాబాద్‌లో పట్టపగలు తాళం వేసిన ఇళ్లకు కన్నాలు వేసి అక్కడి పోలీసులకు దొరికిపోయి 2015లో చెర్లపల్లి జైలుకు వెళ్లాడు. బయటకు వచ్చిన తర్వాత మహబూబ్‌నగర్, నిర్మల్ జిల్లాల్లో 30 దొంగతనాలు చేశాడు. 2022 ఫిబ్రవరిలో నిర్మల్ పోలీసులు పట్టుకుని జైలుకు పంపగా, విడుదలైన తర్వాత మహారాష్ట్ర జిల్లా నాందేడ్ మండలం ధర్మాబాద్ గ్రామానికి మకాం మార్చాడు. అక్కడి నుంచి జగిత్యాల రూరల్, రాయికల్, కోరుట్ల, మెట్‌పల్లి మండలాల్లో పట్టపగలే తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ చేసి, ధర్మాబాద్ వెళ్లి పేకాట ఆడుతూ, మద్యం తాగుతూ జల్సాలు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణకుమార్, రాయికల్ ఎస్సై కిరణ్‌కుమార్ మైతాపూర్ శివారులో మల్లన్నగుడి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, లక్ష్మణ్ రాయికల్‌లో దొంగిలించిన పల్సర్ బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకున్న సీఐ, ఎస్సైలను డీఎస్పీ అభినందించారు.

## రూ.3 వేల కోసం ప్రాణం తీసుకున్నాడు

- మల్లాపూర్‌లో యువకుడి ఆత్మహత్య



వికాస్ (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): తండ్రి రూ.3 వేలు ఇవ్వలేదని, క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన అప్పాల మల్లేశ్–జల దంపతులకు కుమార్తె, కుమారుడు వికాస్(19) ఉన్నారు. కూతురికి వివాహం కాగా కుమారుడు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం తల్లి జల వ్యవసాయ పనులకు వెళ్లింది. తండ్రి గొర్రెలను మేపేందుకు వెళ్తుండగా వికాస్ తనకు రూ.3 వేల కావాలని అడిగాడు. ఇప్పుడు తన వద్ద లేవని, సాయంత్రం వచ్చాక ఇస్తానని చెప్పి, మల్లేశ్ గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. దీంతో మనస్తాపానికి గురైన వికాస్ క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి, ఉరేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ కుమార్ పేర్కొన్నారు.

## నవలా రచయిత రేగులపాటి మృతి



కిషన్‌రావు (ఫైల్)

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌కు చెందిన ప్రముఖ నవలా రచయిత రేగులపాటి కిషన్‌రావు(77) మృతిచెందారు. ఆయన 1946 డిసెంబర్ 1న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చింతలఠానాలో జన్మించారు. 1970 నుంచి 2004 వరకు ఉపాధ్యాయునిగా పనిచేసి, కరీంనగర్ రాంనగర్‌లో స్థిరపడ్డారు. ఆయన 4 నవలలు, 6 కథా సంకలనాలు, 13 కవిత్వ సంకలనాలు వెలువరించారు. అభ్యుదయ భావాలతో ఆయన రచనలు సాగాయి. 1976లో ఆమె వితంతువు కాదు, 1978లో పతివ్రత ఎవరు?, 1981 లో సంఘర్షణ, 1982లో ప్రేమకు పెళ్లెప్పుడు? అనే నవలలు ఆయనకు మంచి పేరు తెచ్చాయి. ఉత్తమ కవితా బహుమతి, సినారె సాహితీ పురస్కారం, ఉత్తమ కవి అవార్డు, ఉగాది పురస్కారం, మలయశ్రీ ప్రగతి శీల సాహితీ అ వార్డు అందుకున్నారు. ఏడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాంనగర్‌లోని ఇంట్లోనే చనిపోయారు. కిషన్‌రావు స్ఫూర్తితో ఆయన భార్య విజయలక్ష్మి కూడా రచనలు చేశారు. ఆయన మృతికి సాహితీవేత్తలు దాస్యం సేనాధిపతి, గండ్ర లక్ష్మణరావు, అన్నవరం దేవేందర్, వాణిశ్రీ, బుర్ర తిరుప తి, దామకుంట శంకరయ్య, కూకట్ల తిరుపతి, గాజుల రవీందర్, సీవీ కుమార్, మాడిశెట్టి గోపాల్ సంతాపం తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ సంతాపం ప్రకటించారు.

## రూ.4 కోట్ల అప్పులు.. కుటుంబసభ్యులతో పరారీ



నిందితుడి ఇంటి గోడపై రాసిన రాతలు



ఆందోళన చేస్తున్న బాధితులు

- నిందితుడి ఇంటి ఎదుట బాధితుల ఆందోళన

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో అప్పు తీసుకొని, కుటుంబసభ్యులతో సహా పరారైన వ్యక్తి ఇంటి ఎదుట బాధితులు ఆందోళన చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం .. గోవిందుపల్లికి చెందిన గాండ్ల వెంకన్న జగిత్యాల పట్టణంలోని కొంతమంది వద్ద చిట్టీలు, రియల్ ఎస్టేట్ పేరిట సుమారు రూ.4 కోట్ల వరకు అప్పులు తీసుకున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి, తన కుటుంబసభ్యులతో కలిసి పరారయ్యాడు. దీంతో బాధితులందరూ గురువారం అతని ఇంటితోపాటు సమీప ప్రాంతాల్లో గాండ్ల వెంకన్న కనిపించడం లేదని, అతన్ని పట్టించిన వారికి రూ.3 లక్షల నజరానా ఇస్తామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గోవిందుపల్లిలోని అతని ఇంటి గోడలకు ఈ ఇల్లును కొనాలనుకునేవారు తమను సంప్రదించాలని రాశారు. అనంతరం అక్కడే ఆందోళనకు దిగారు.